

సోమశిలలో 63.437 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 63.437 టీఎంసీలు ఉన్నాయి. 1099 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.88,920
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,002
3 శాతం జీఎస్టీతో	రూ.8,242
నవర (8 గ్రా)	రూ.65,936

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 /22.0

జిల్లాలో వాతావరణం శనివారం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 49 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

బర్డ్ ఫ్లూ వైరస్‌పై అప్రమత్తం

- జిల్లా సరిహద్దులో కోళ్ల రవాణా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మర్రిపాడు: బర్డ్ ఫ్లూ వైరస్ నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా సరిహద్దుల్లో అధికారులు శుక్రవారం కోళ్ల లోడుతో వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వైఎస్సార్ జిల్లా ల్యాబ్ ఏడీ, బద్వేల్ ఏడీ నాగభూషణం, మర్రిపాడు మండల పశుసంవర్ధక శాఖ సహాయకులు ముజమిల్, రాచాల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌పై ఆరోపణలు వస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తే సంబంధిత సెంటర్ బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు హెచ్చరించారు. సాక్షిలో లక్ష్యం ప్రాక్టి'కిల్' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై ఎట్టకేలకు ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు స్పందించారు. శుక్రవారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఐఓ కార్యాలయం నుంచి చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కళాశాలల యాజమాన్యాల ఒత్తిళ్లకు, ప్రలోభాలకు తలొగ్గితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాక్టికల్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీవీఈఓ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు 81 మంది గైర్హాజరు

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు జిల్లాలో మొత్తం 81 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2029 మందికి 2012 మంది హాజరయ్యారు. 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 2061 మందికి 1997 మంది హాజరయ్యారు. 64 మంది గైర్హాజరయ్యారు.

పరిశోధనల్లో నెల్లూరుకు ప్రత్యేక స్థానం

- వ్యవసాయంలో నూతన పద్ధతులు
- కిసాన్ మేళాలో శాస్త్రవేత్తలు



పరిశోధనల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖాధికారులు

నెల్లూరు (సెంట్రల్): వరి విత్తనాల పరిశోధనలకు సంబంధించి నెల్లూరుకు ప్రత్యేక స్థానం ఉందని లాంఫాం యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు శివన్నారాయణ అన్నారు. నెల్లూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు పరిశోధన స్థానం నుంచి వరి వంగడాలపై కొత్తగా పలు పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. లాంఫాం పరిశోధనా సంచాలకులు సత్యనారాయణ మాట్లాడుతూ 1937లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో స్థాపించిన ఈ పరిశోధన స్థానం 1961 నుంచి నెల్లూరులో ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఇక్కడి అనేక పరిశోధనలు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయని తెలిపారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుమతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభదాయక నూతన పద్ధతులు అనుసరణీయం అన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మండలాల్లోని వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు అందిస్తున్నారని, శాస్త్రవేత్తలు సూచనలు తీసుకుంటే మంచిదన్నారు. ప్రధాన శాస్త్రవేత్త వినీత, కృషి విజ్ఞాన కో-ఆర్డినేటర్ లలితా శివజ్యోతి మాట్లాడారు.

మద్దతు ధరలు కల్పిస్తే చాలు

రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని కిసాన్ మేళాకు వచ్చిన పలువురు రైతులు అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు. తమకు మద్దతు ధర ఎంతో అవసరమని, ఆ ధరే లేనప్పుడు ఈ సభలు, సమావేశాలు ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వాన్ని పొగడడానికే ప్రాధాన్యం ఇవ్వడంతో రైతులు లేచి వెళ్లిపోయారు.

బాలికలపై మృగాళ్ల పంజా



- ఆడపిల్ల బడికెళ్లి ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులకు టెన్షన్
- మాయ మాటలతో లైంగిక దాడులు
- మరికొందరు బలవంతంగా అఘాయిత్యాలు
- పరువుకు వెరసి సరిపెట్టుకుంటున్న పేరెంట్స్
- పోలీసు స్టేషన్లలో కొంత మంది ఫిర్యాదులు చేస్తున్న వైనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆడ పిల్లలకు, మహిళలకు భద్రత కొరవడింది. బడిలో, బస్సులో, ఇంట్లో, బయట ఎక్కడ చూసినా మృగాళ్ల దాష్టీకానికి బలైపోతున్న ఘటనలు కోకొల్లలు. ఆడపిల్ల ఇంటి నుంచి బయటకు వెళ్తే.. తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. స్నేహం ముసుగులో బాలికలపై కన్నేసి మాయమాటలు చెబుతూ లొంగదీసుకుని లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ బిడ్డపై జరిగిన అఘాయిత్యాన్ని బహిర్గతం చేసుకోలేక గుట్టుచప్పుడు కాకుండా ఉండిపోతున్నారు. అరకొర ఘటనలే పోలీస్‌స్టేషన్ల వరకు వెళ్తున్నాయి. అక్కడ కూడా మనీ, పవర్ ఉపయోగించి కేసుల నమోదు వరకు వెళ్లకుండా బయట పడుతున్నారు.



నెల్లూరు (టౌన్): జిల్లాలో నిత్యం ఏదోక ప్రాంతంలో బాలికలపై మృగాళ్ల లైంగిక దాడులు, వేధింపుల ఘటనలు అధికమవుతున్నాయి. ఇంటా, బయట ఆడ పిల్లకు భద్రత లేకుండా పోతోంది. అయితే కొన్ని ఘటనలు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో, మరికొన్ని బయట ప్రాంతాల్లో జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కొందరు బాలికలు ఇంట్లో చెబుతుండగా, ఇంకొందరు చెప్పకుండా లోలోన మదన పడుతున్నారు. కొందరు తల్లిదండ్రులు పరువుకు భయపడి బయటకు రాకుండా సరిపెట్టుకుంటున్నారు. కొన్ని ఘటనల్లో నిందితుల తరపున బెదిరింపులకు లొంగి రాజీ కుదుర్చుకోవడం లేదా మిన్నకుండిపోవడం జరుగుతోంది. మరికొన్ని ఘటనల్లో ఫిర్యాదు చేసి శిక్ష పడే వరకు పోరాడుతున్నారు.

ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలు

జిల్లాలో 3,438 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1,52,922 మంది బాలికలు చదువుకుంటున్నారు. వీరంతా మైనర్ బాలికలే. వీరికి బయట ప్రపంచంపై అంత పూర్తి పరిజ్ఞానం ఉండదు. ఎవరు ఏం చెప్పినా పూర్తిగా నమ్మేస్తారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది బాలికలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడుతున్నారు. పిల్లలు బడికి పోయి ఇంటికి వచ్చేంత వరకు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్న పరిస్థితి ఉంది.



పాఠశాలలో చదువుతున్న బాలికలు

నెల్లూరు రూరల్ మూడో మైలులోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఓ బాలికపై లైంగిక దాడి జరిగింది. నరుకూరు దళితవాడకు చెందిన సతీశ్ ఆ బాలికను ప్రతి రోజు ఇంటి నుంచి స్కూల్‌కు, మళ్లీ స్కూల్ నుంచి ఇంటి దగ్గరకు ఆటోలో తీసుకెళ్తుంటాడు. సదరు బాలికపై కన్నేసిన ఆటో డ్రైవర్ సతీశ్ కొత్త కోడూరు బీచ్‌కు తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడి చేశారు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు రూరల్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా ఆటోడ్రైవరు సతీశ్, అతని స్నేహితులపై పోక్సో కేసు నమోదైంది.

- కావలిలోని ముసునూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గత శనివారం అర్ధరాత్రి తర్వాత ముసుగులు ధరించిన ముగ్గురు ఆగంతకులు మారణాయుధాలతో ప్రవేశించి బాలికలను తీవ్ర భయాందోళనలకు గురి చేశారు. ఈ ఘటనను స్కూల్ యాజమాన్యంతో పాటు పోలీసులు గోప్యంగా ఉంచారు. మరుసటి రోజు బాలికలు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వచ్చి కేజీబీవీ ముందు ఆందోళనకు దిగారు.
- వెంకటాచలం మండలంలోని గుడ్లూరువారిపాళెంలో రెండో తరగతి చదువుతున్న ఆరేళ్ల బాలికపై 10వ తరగతి చదువుతున్న విద్యార్థి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- ఇటీవల సంతపేటలోని మోడల్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న బాలికపై అదే పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్ లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై సదరు బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో పాఠశాలకు వచ్చి అటెండర్‌కు దేహశుద్ధి చేశారు. అయితే హెడ్‌మాస్టరు, కొంతమంది ఉపాధ్యాయులు వారి మధ్య రాజీ కుదిర్చినట్లు తెలిసింది. ఈ మూడే ఘటనలు కాదు. ప్రతి రోజు జిల్లాలో ఏదొక ప్రాంతంలో జరుగుతున్న పరిస్థితి.

పోక్సో చట్టం ఉన్నా..

బాలికలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తారని తెలిసినా మృగాళ్లు వెనక్కి తగ్గడం లేదు. ఇలాంటి కేసుల్లో జీవిత ఖైదు, లేదా 7 నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. అయినా లైంగిక దాడులు ఆగడం లేదు. దీంతో పాటు నేటి స్మార్ట్ యుగంలో చిన్న పిల్లల్లో సైతం స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ఉండడంతో పిల్లలు చెడుమార్గంలో పడే అవకాశం ఉందని సైకాలజిస్టులు, విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఏమి చేస్తున్నారో, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలంటున్నారు.

బాలికల రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం



పాఠశాలల్లో బాలికల రక్షణపై ప్రత్యేక మైన చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏదైనా ఘటన జరిగినప్పుడు బాలికలు లేదా బాలురు వెంటనే తల్లిదండ్రులు దృష్టికి తీసుకెళ్లాలని చెప్పాం. ఉపాధ్యాయులు పాఠశాలల్లో నిత్యం పర్యవేక్షిస్తుంటారు. రానున్న రోజుల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– ఆర్ బాలాజీరావు, డీఈఓ

సెక్యూరిటీ పెంచాలని అడిగాం



బాలికలు ఉండే వసతిగృహాలు వద్ద సెక్యూరిటీ పెంచాలన్న విషయాన్ని ఎస్పీడీ దృష్టికి తీసుకెళ్లాం. ఆ ప్రాంతంలో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని కోరాం. హాస్టల్స్ ఉన్న ప్రాంతాల్లో లైటింగ్ కూడా పెంచాల్సి ఉంది. భవిష్యత్‌లో ఎలాంటి ఘటనలు జరగకుండా హాస్టల్స్, కేజీబీవీలు, భవిత కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిని అప్రమత్తం చేశాం.

– డి. వెంకటసుబ్బయ్య, ఏపీసీ సమగ్రశిక్ష

తల్లిదండ్రులదే బాధ్యత



లైంగిక దాడులు, యువత పోకడలకు తల్లిదండ్రులదే ప్రధాన బాధ్యత. పిల్లల అలవాట్లు, స్నేహితులు, పూర్తి స్వేచ్ఛ కల్పించడం వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకే పరిమితమై నైతిక విలువలు నేర్పించడం లేదు. సామాజిక మాధ్యమాల వల్ల యువత క్రమశిక్షణ కోల్పోయి నేర ప్రవృత్తి, లైంగిక దాడులకు పాల్పడుతున్నారు.

– సీహెచ్ రమేష్‌బాబు, సైకాలజిస్టు, లైఫ్ స్కిల్స్ కౌన్సిలర్

బీపీసీఎల్‌కు భూములిచ్చేది లేదు

- మత్స్యకార గ్రామాల తీర్మానం
- హడావుడి చేసి టెంట్లు పీకేసిన పోలీసులు



అలగాయపాళెంలో సమావేశమైన వివిధ తీర గ్రామాల మత్స్యకారులు

ఉలవపాడు: పరిశ్రమల పేరుతో మత్స్యకార గ్రామాల్లోని భూములు తీసుకుంటామంటే సహించేది లేదని, బీపీసీఎల్‌కు భూములిచ్చేది లేదని, అవసరమైతే అందరూ కలిసికట్టుగా పోరాడాలని మత్స్యకార గ్రామాల నాయకులు తీర్మానించారు. మండలంలోని అలగాయపాళెంలో శుక్రవారం మత్స్యకారుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తీరంలో ఉన్న మత్స్యకార గ్రామాలు ఖాళీ చేయించి ఆ భూములు లాక్కోవడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఇలా పరిశ్రమల పేరుతో భూసేకరణ చేయాలని నిర్ణయించిందని దీనిని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రధాన పంటలుగా వరి, వేరుశనగతోపాటు సపోట, మామిడి తోటలను ఖాళీ చేయించాలనుకోవడం బాధాకరమన్నారు. మత్స్యకారులందరూ ఐక్యంగా ఉండి ఈ భూసేకరణ వ్యతిరేకించాలని నిర్ణయించారు. పచ్చని పంటలు పండే భూములు సేకరించడం వల్ల ప్రజలకు అన్నం కూడా దొరికే పరిస్థితి ఉండదన్నారు. అటవీ, పోరంబోకు భూములు పరిశ్రమలకు కేటాయించకుండా కరేడు, చాకిచర్ల, పెదపట్టపుపాళెం, రామాయపట్నం గ్రామాల స్వరూపం లేకుండా ఖాళీ అయ్యేలా భూసేకరణ చేయాలని ఈ ప్రభుత్వం పన్నాగం పన్నిందన్నారు. ఇటీవల కలెక్టర్ పర్యటించడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అలగాయపాళెం కాపు వాయల వెంకటేశ్వర్లు, చాకిచర్ల పెదపట్టపుపాళెం కాపు రామ్మూర్తి, టెంకాయచెట్ల పాళెం కాపు గోవిందుతో పాటు కరేడు పెదపల్లిపాళెం, బట్టిసోమయ్యపాళెం, అంకమ్మపాళెం, చినపట్టపుపాళెం, పల్లెపాళెం గ్రామకాపులు హాజరయ్యారు. కార్యక్రమంలో మత్స్యకార గ్రామాల కాపులు, 139 కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు హాజరయ్యారు.

సమావేశం జరగకుండా పోలీసుల యత్నం

మత్స్యకార గ్రామాల ప్రజల సమావేశాన్ని ఆపాలని పోలీసులు ప్రయత్నం చేశారు. భూములు అప్పగించడానికి వ్యతిరేకంగా సమావేశం అని తెలియడంతో వేసిన టెంట్‌లు విప్పేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సమావేశం ఆపాలని పోలీసులు ప్రయత్నించినట్లు మత్స్యకార గ్రామ నాయకులు తెలిపారు. సమావేశం జరగడానికి వీల్లేదని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంకమ్మ టెంట్‌లు తీయించారు. తాము ధర్నా చేయడం లేదని తమ కుల సమావేశం ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పినా వినకుండా టెంట్‌లు ఊడదీయించారు. దీంతో వారు బహిరంగంగానే ఉన్న చోట సమావేశం జరిపారు.

పాథమిక పాఠశాలలను కొనసాగించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ప్రాథమిక పాఠశాలలను కొనసాగిస్తూ మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతి సూచించారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ ఆర్.బాలాజీరావును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 60 మంది ఉన్న ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయాలన్నారు. ఉర్దూ మీడియం స్కూల్స్‌ను యథావిధిగా కొనసాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు అచ్చయ్య, నాగిరెడ్డి, ఖాజావలి, రమణయ్య, జమీర అహ్మద్ పాల్గొన్నారు.

మనీ స్కామ్.. అంతా కామ్

ఏదోక సంస్థ పేరుతో రూ.వంద కోట్ల స్కామ్ జరిగితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి దర్యాప్తు సంస్థల వరకు హడావుడి చేస్తాయి. కానీ కావలి పరిసరాల్లోనే సుమారు రూ.200 కోట్ల స్కామ్ జరిగిందనే విషయం వెలుగులోకి వచ్చినా ఎవరి నుంచి స్పందన కనిపించకపోవడంతో ఇందులో పెట్టుబడి పెట్టిన బాధితుల్లో ఆందోళన అధికమవుతోంది. ఈ స్కామ్‌లో పోలీసులే ప్రధాన పాత్రధారులు కావడంతో దర్యాప్తుతోపాటు ఆస్తుల స్వాధీనం అంతా కామ్ అయిపోయినట్లు తెలుస్తోంది.

- ఈ వ్యవహారంలో పోలీసులదే ప్రధాన పాత్ర
- తిలా పాపం.. తలా పిడికెడు
- ఆర్థిక నేరగాడికి అనుచరులుగా మారిన ఖాకీలు
- ఇంత పెద్ద స్కామ్ వెలుగులోకి వచ్చినా స్పందించని ప్రభుత్వం
- సీఐడీ, సీబీఐ విచారణ సంస్థలతోనే అసలు న్యాయం

కావలి: కావలి పట్టణాన్ని కుదిపేస్తున్న మనీస్కాం వ్యవహారంపై కొద్ది రోజుల్లోనే ఆ'శుభం' కార్డు పడనుంది. ఈ స్కామ్‌లో పోలీసులే ప్రధాన సూత్రధారులు, పాత్రధారులు కావడంతో రాష్ట్ర పోలీస్‌శాఖతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉదాసీనత ప్రదర్శిస్తోందని తెలుస్తోంది. ఆర్థిక నేరాలను అలవోకగా చేసే మహ్మద్ సుభాని మాటలు నమ్మి కావలితోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి బాధితులు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టారు. తెలంగాణలోని మక్తల్‌లో 2021లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో సుమారు రూ.70 కోట్లకు పైగా కొల్లగొట్టిన సుభాని వ్యవహారం తెలిసీ కావలిలో కొందరు పోలీసు సిబ్బంది ప్రోత్సహించడంతో అతి తక్కువ కాలంలోనే ప్రజల నుంచి రూ.200 కోట్ల మేర కొల్లగొట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సాధారణంగా పాతనేరస్తుల విషయంలో నిఘా ఉంచే పోలీసు యంత్రాంగం ఇక్కడ మాత్రం ఏకంగా ఆర్థిక నేరగాడికి ఎర్ర తివాచీ పరిచి ఏజెంట్ల అవతారమెత్తడం విశేషం. సుభానిని ప్రజలు కూడా నమ్మి పిల్లల చదువులు, పెళ్లిళ్లకు దాచుకున్న డబ్బులు, ఇంటి కోసం పొదుపు చేసుకున్న సొమ్ముతోపాటు, బ్యాంకు లోన్లు తీసుకుని, తెలిసిన వారి వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వందలాది మంది అతని వద్ద పెట్టుబడులు పెట్టారు. కేవలం ఏడాది కాలంలోనే సుమారు రూ.200 కోట్ల మేర కొల్లగొట్టాడంటే ఇది మామూలు విషయం కాదు.



ఒకటి, రెండు రోజుల్లో తేలిపోనుంది

మనీస్కాంపై ఒకటి, రెండు రోజుల్లో జిల్లా పోలీస్ బాస్ ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పది రోజుల నుంచి దర్యాప్తు సాగుతున్నా, జరిగిన స్కామ్ ఎంత, నిందితుడి వద్ద ఎంత మొత్తంలో సొత్తు స్వాధీనం చేసుకున్నారు, ఇందులో పోలీసుల పాత్రపై కూడా ఎక్కడా సమాచారం బయటకు పొక్కకుండా వ్యవహరిస్తున్నారు. పోలీసులు ఇంత వరకు నోరు మెదపకపోవడంతో బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పోలీసు వ్యవస్థ ఇంత నిద్రాణంగా ఉందా?

మహ్మద్ సుభాని విషయంలో పోలీసు వ్యవస్థ కళ్లకు గంతలు కట్టుకుంది. ఆర్థిక నేరాల్లో ఆరితేరిన పాతనేరస్తుడు కనీసం రిజిస్ట్రేషన్ కూడా లేని సంస్థను ఏర్పాటు చేసి రూ.కోట్లు దండుకుంటున్నా, ఆరేడు నెలల క్రితమే పత్రికల్లో కథనాలు వచ్చినా సంస్థ వైపు కన్నెత్తి చూడలేదు. పైపెచ్చు పోలీసు సిబ్బందే ఏజెంట్లుగా మారి సుభానిపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వ్యవహరించారు. వీరి విషయంలో ఉన్నతాధికారులు కూడా మౌనంగా ఉండడం విమర్శలకు తావిస్తోంది.

సీఎం పర్యటనకు 1060 మందితో భద్రత

కందుకూరు: సీఎం చంద్రబాబు శనివారం కందుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో 1060 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ఎవరికి నిర్ణయించిన ప్రదేశాల్లో వారు హాజరు కావాలన్నారు. అడిషనల్ ఎస్పీ (ఏఆర్) మునిరాజు, ఎస్బీ టౌన్, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు ఏఆర్, హెచ్‌జీ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ ఆర్ఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి : సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, సబ్ కలెక్టర్ టి.శ్రీపూజతో కలిసి అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. టీజీపీ స్పెషల్ కలెక్టర్ శీనానాయక్, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సమస్యలెన్నో..!

• సిబ్బందికి క్వార్టర్స్ ఏవీ..?
• అందరూ అవుట్‌సోర్సింగే
• విద్యార్థినుల రక్షణా అంతంతమాత్రమే
• కావలి ఘటనతో తల్లిదండ్రుల్లో ఆందోళన



కావలిలోని కేజీబీవీ



విద్యార్థినులు

కావలి: గ్రామీణ ప్రాంత విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) సమస్యలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితమే వీటిని ఏర్పాటు చేసినా, వసతులను కల్పించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఫలితంగా సమస్యలు తాండవిస్తూ.. విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ చదువుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ముగ్గురు ఆగంతకులు మారణాయుధాలతో కావలి కేజీబీవీలో ఆదివారం కలకలం సృష్టించడంతో ఇందులో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

2004లో శ్రీకారం

కేజీబీవీలను 2004లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2004 – 05 విద్యాసంవత్సరం నుంచి 12 కేజీబీవీలు మొదలయ్యాయి. కావలి, ఏఎస్ పేట, కొండాపురం, కలిగిరి, నందిపాడు, మర్రిపాడు, సీతారామపురం, కందుకూరు, గుడ్లూరు, వలేటివారిపాళెం, ఉలవపాడు, లింగసముద్రంలో ఇవి ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి పాఠశాలలో ఆరు నుంచి 12వ తరగతి వరకు బోధిస్తున్నారు. తరగతులు, హాస్టల్ కలిపి ఒకే ప్రాంగణంలో ఉండాలి. ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో 262 మంది విద్యార్థినులున్నారు. వీరిలో ఆరు నుంచి పదో తరగతి వరకు 200 మంది చదువుకుంటున్నారు.

కానరాని క్వార్టర్స్

కేజీబీవీల్లో తరగతి గదులు, వసతి గృహం ఒకే ప్రాంగణంలోనే ఉండాలనే నిబంధన ఉంది. విధులు నిర్వర్తించే ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందీ అదే ప్రాంగణంలో నివాసం ఉండాలి. అయితే వీరికి ఎలాంటి క్వార్టర్స్‌ను ప్రభుత్వం నిర్మించలేదు. దీంతో బయట నివాసాలను అద్దెకు తీసుకొని ఉండాల్సి వస్తోంది. ఫలితంగా బాలికలపై వీరి పర్యవేక్షణ కొరవడుతోంది.

అటవీ ప్రాంతంలో..

కావలిలోని కేజీబీవీ అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ ఆకతాయిలు స్వైర విహారం చేస్తున్నారు. ఇక్కడ విధుల్లో ఉండే వారు డేగకళ్లతో పర్యవేక్షించాలి. ఇక్కడి ప్రాంగణానికి ఉన్న ప్రహరీ ఎత్తు చాలా తక్కువగా ఉంది. దీన్ని పెంచాల్సి ఉన్నా, అధికారులు పట్టించుకోవడంలేదు. కేజీబీవీ పరిసరాల్లో లైటింగ్‌ను పెంచాల్సిన అవసరమూ ఉంది. కావలిలోని కేజీబీవీ వద్ద ప్రభుత్వం నిర్మించిన పక్కా గృహాల సముదాయం ఉంది. ఇందులో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి తాత్కాలికంగా క్వార్టర్స్‌ను కేటాయించినా బాలికలు మరింత సురక్షితంగా ఉండేందుకు దోహదపడుతుంది.

అందరూ కాంట్రాక్ట్ ప్రాతిపదికనే

కేజీబీవీల్లో 13 మంది ఉపాధ్యాయ, 13 మంది ఉపాధ్యాయేతర సిబ్బంది విధులు నిర్వర్తించాలి. అయితే వీరిలో ఎవరూ శాశ్వత ఉద్యోగులు కారు. ఉపాధ్యాయులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన.. ఉపాధ్యాయేతర సిబ్బంది అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులకు నెలకు రూ.27 వేలు.. మిగిలిన వారికి రూ.15 వేలను ప్రభుత్వం చెల్లిస్తోంది. అదే పర్మనెంటైతే వీరికి వరుసగా రూ.లక్ష, రూ.50 వేల మేర జీతాలందుతాయి. తమను క్రమబద్ధీకరించాలని వీరు కోరుతున్నా, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.

ఆటో ఖర్చులూ వీరిపైనే..

కేజీబీవీల్లోని బాలికలకు ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలంటే దానికయ్యే ఆటో ఖర్చులనూ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందే భరించాల్సి వస్తోంది. రాత్రి వేళ వీరిని తీసుకెళ్లాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. మరోవైపు ఇక్కడ మహిళా ఉద్యోగులే ఉండాలనేది ప్రభుత్వ నిబంధన. ప్రాంగణాల్లో రాత్రి వేళ మహిళలే కాపలాదారులుగా విధులు నిర్వర్తించాల్సి ఉండటంతో ఆచరణలో సమస్యలు తలెత్తుతున్నాయి.

ఉన్న గదుల్లోనే అన్నీ..

కావలిలోని కేజీబీవీలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఐదు గదులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో విద్యార్థినుల సామగ్రిని ఉంచుకునేందుకే రెండు సరిపోయాయి. మిగిలిన మూడు గదుల్లోనే తరగతుల నిర్వహణతో పాటు పిల్లలు నిద్రించాల్సి వస్తోంది. ఇక్కడ వసతులను మెరుగుపర్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సబ్బులు, నూనెను ఇవ్వనే లేదు

“నేను ఆరో తరగతిలో ఇక్కడ చేరా. ఇప్పుడు తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఇప్పటి వరకు సబ్బులు, నూనె తదితరాలను ఇవ్వనే లేదు. హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్స్‌ను ఇస్తారని విన్నాం. అయితే మాకు మాత్రం అందించలేదు.

– విద్యార్థి

సురక్షితంగా చూడటమే అసలు డ్యూటీ

“ప్రాంగణంలో బాలికలకు ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తగా చూడటమే అసలు డ్యూటీ. పిల్లలతో కలిసి ఉండటమనేది జీవితంలో ఓ భాగమైపోయింది. పిల్లల కోసం ఏమి చేసినా సంతృప్తిగా ఉంటుంది. జీతం తక్కువనే ఆలోచనే ఉండదు.

– ఉద్యోగి, కేజీబీవీ

క్లుప్తంగా

27, 28న వీఎస్‌యూలో సైన్స్ డే



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ తదితరులు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాతీయ సైన్స్ డేను ఈ నెల 27, 28న నిర్వహించనున్నామని ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎనిమిది నుంచి పదో తరగతి, డిగ్రీ విద్యార్థులు హాజరై విజ్ఞాన ప్రదర్శనలు, ప్రత్యక్ష ప్రయోగాలు, పోటీల ద్వారా శాస్త్రీయ అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త ఆవిష్కరణలు చేసేందుకు విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రోగ్రామ్ కన్వీనర్ నీలమణికంఠ, హుస్సేనయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాన్ ఇండియా జ్యువెలరీ షో ప్రారంభం



నెల్లూరు(బృందావనం): మహిళల కోసం ప్రత్యేకంగా పాన్ ఇండియా జ్యువెలరీ షోను ఏర్పాటు చేశామని సంస్థ నిర్వాహకురాలు సజ్జా అన్నపూర్ణ, నిరంజన్ పేర్కొన్నారు. నగరంలోని మినర్వాగ్రాండ్‌లో పాన్ ఇండియా జ్యువెలరీ ఎక్స్‌పోను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలోని 20 రకాల బ్రాండెడ్ జ్యువెలరీ స్టాళ్లు ఇక్కడ ఉన్నాయని చెప్పారు. శని, ఆదివారాల్లో ఉదయం 10.30 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిమ్మ ధరలు



పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.18

ఐటీఐలో ఉచితంగా కంప్యూటర్ కోర్సు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిరుద్యోగులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ అనే కంప్యూటర్ కోర్సును ఏపీఎస్సెస్డీసీ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచితంగా నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలను కల్పించనున్నామని వెల్లడించారు. ఆసక్తి గల వారు కళాశాలకు సోమవారం వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94944 56326, 97045 10793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మద్యం దుకాణ ఏర్పాటు అడ్డగింత

ఆత్మకూరు: మండలంలోని వాశిలిలో ఇటీవల మంజూరైన మద్యం దుకాణ ఏర్పాటు యత్నాలను బీసీ కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ వెంకటరమణమ్మకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని తూర్పు దళిత కాలనీ సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు రెండు రోజుల క్రితం యత్నించగా, వారు తీవ్ర నిరసన వ్యక్తం చేసి అడ్డుకున్నారు. దీంతో లైసెన్స్ పొందిన వ్యక్తి.. బీసీ కాలనీ రైస్‌మిల్లు వద్ద ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని చదును చేయిస్తుండగా విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకున్నారు. దీంతో దుకాణాదారుడు యత్నాన్ని విరమించుకున్నారు. మరో స్థలాన్ని పరిశీలించి దుకాణ ఏర్పాటుకు అనుమతిస్తామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

నెల్లూరు సిటీ: విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన ధనలక్ష్మీపురంలోని ఓ పాఠశాల ఉపాధ్యాయుడిపై కేసును నెల్లూరు రూరల్ పోలీసులు శుక్రవారం నమోదు చేశారు. ఉపాధ్యాయుడు వీరరాఘవులు అవహేళనగా మాట్లాడటంతో హాస్టల్ భవనం నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మార్పులకు అనుగుణంగా సన్నద్ధం కావాలి

• మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత సన్నద్ధం కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నైపుణ్య శిక్షణ పొందుతున్న వారు, సింహపురి విద్యాసేవా సమితి, నర్సింగ్ కళాశాల, స్వర్ణభారత్ విద్యామందిర్ విద్యార్థులతో శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. సమాజంలో మార్పులు అనివార్యమని, వీటికి అనుగుణంగా మారకపోతే వృద్ధి ఆగిపోతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయంలో నైపుణ్యం సాధించడం చాలా అవసరమని, కేవలం డిగ్రీలు, పీజీలతో ఉద్యోగాలొస్తాయనే నమ్మకం లేదని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కరెంట్ పని, మొబైల్ ఫోన్లు, ఏసీ, కంప్యూటర్ల మరమ్మతులు తదితర సేవలందించేవారికి చాలా డిమాండ్ ఉందని తెలిపారు. ఉన్నత చదువులు అభ్యసించేందుకు అవకాశం లేని వారు ఇలాంటి అంశాల్లో నైపుణ్య శిక్షణ పొంది ఎదగొచ్చని పేర్కొన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం పొందకుండానే వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడాన్ని అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల తీగల దొంగ అరెస్ట్

• 90 కిలోల రాగి వైర్లు, రూ.1.5 లక్షల నగదు స్వాధీనం



పొదలకూరు: వివిధ మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులో ఉన్న రాగి తీగలను చోరీ చేస్తున్న నిందితుడ్ని పొదలకూరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 90 కిలోల కాపర్ వైర్, రూ.1.5 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై హనీఫ్ వివరాల మేరకు.. మండలంలోని అమ్మవారిపాళేనికి చెందిన కట్టా ప్రసాద్ కొంతకాలంగా పొదలకూరు, నెల్లూరు రూరల్, బుచ్చిరెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, వింజమూరు, వెంకటాచలం మండలాల్లో గల గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి రాగి తీగలను అపహరించసాగారు. ఇప్పటి వరకు 27 కేసులు నమోదయ్యాయి. అమ్మవారిపాళెంలో ఉండగా అదుపులోకి తీసుకున్నామని ఎస్సై చెప్పారు.

జిల్లాలో క్లస్టర్ సమావేశాలు నేడు

• ప్రతి నెలా మూడో శనివారాన నిర్వహణ



క్లస్టర్‌కు ఎంపికైన నందిపాడు ఉన్నత పాఠశాల

దుత్తలూరు: ఇప్పటి వరకు ప్రతి నెలా నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల స్థానంలో కొత్తగా క్లస్టర్ సమావేశాలను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రతి నెలా మూడో శనివారాన వీటిని నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇటీవల నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ప్రకటించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు వరకు వీటిని జరపాల్సి ఉంది. ఉదయం 11.45కే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇళ్లకు పంపాలి. రెండో పూట విద్యార్థులకు సెలవును ప్రకటించారు. సమావేశానికి ఉపాధ్యాయులు విధిగా హాజరై బయోమెట్రిక్‌ను వేయాల్సి ఉంటుంది.

ఇంటర్నెట్ తప్పనిసరి

క్లస్టర్ సముదాయ పాఠశాలలో ఇద్దరు చురుకైన, మంచి బోధన సామర్థ్యం, వనరులు కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఇద్దరు ఉంటారు. మొత్తం ఎనిమిది మంది స్ట్రాంగ్ టీచర్లను ఎంపిక చేసుకొని సిద్ధంగా ఉండాలి. ఉపాధ్యాయులకు వీరు శిక్షణ ఇవ్వనున్నారు. మరోవైపు సమావేశాలను నిర్వహించే పాఠశాలల్లో ఐఎఫ్పీలు పని చేసే స్థితిలో ఉండాలి. పాఠశాలలో ఇంటర్నెట్ కచ్చితంగా అందుబాటులో ఉండేలా చూడాలి. విద్యాశాఖ ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహిస్తుంటారు. మరోవైపు జిల్లాలోని నాలుగు విద్యాశాఖ డివిజన్లలో గతంలో 253 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా, ప్రస్తుతం వీటిని 137 క్లస్టర్లుగా విభజించారు. ఆయా క్లస్టర్లలో సమావేశాలను శనివారం నిర్వహించనున్నారు.

విధిగా హాజరుకావాలి



“క్లస్టర్ సమావేశాలకు ఉపాధ్యాయులు తప్పక హాజరుకావాలి. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు పాఠశాలను ఉదయం నిర్వహించి, మధ్యాహ్నం సెలవు ప్రకటించారు. సమావేశం మధ్యాహ్నం ప్రారంభంకానుంది.

– రమేష్, ఎంఈఓ, దుత్తలూరు

టర్బో లారీల సీజ్



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని పాతాళపల్లి హైవేపై అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టర్బో లారీలను నెల్లూరు మైనింగ్ ఆర్‌ఐ స్వాతి అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. కలువాయి మండలంలోని పెన్నాబద్వేల్ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తూ పాతాళపల్లి హైవే పక్కన ప్రైవేట్ భూమిలో డంప్ చేస్తున్నారంటూ జిల్లా మైనింగ్ అధికారులకు స్థానికులు సమాచారమిచ్చారు. దీంతో వీటిని సీజ్ చేసి సోమశిల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	105
లేయర్ (లైవ్) :	80
బ్రాయిలర్ చికెన్ :	194
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	216
లేయర్ చికెన్ :	136

నేత్రపర్వంగా పల్లకిసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల పూజలను శుక్రవారం నిర్వహించారు. వేదపారాయణం, అనంతరం సంధ్య మేళాన్ని జరిపారు. అమ్మవారికి కుంభహారతులు, పల్లకిసేవ నేత్రపర్వంగా రాత్రి నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.